క్లుప్తంగా

చెరువులు, కుంటల పరిశీలన



కుంట పరిశీలిస్తున్న ఈఈ ప్రశాంత్

కథలాపూర్: మండలంలోని పెగ్గెర్ల, దుంపేట గ్రామశివారుల్లోని చెరువులను, కుంటలను నీటిపారుదలశాఖ ఈఈ ప్రశాంత్ సోమవారం పరిశీలించారు. దుంపేట శివారులో వరద కాలువ నుంచి కుంటను నింపేందుకు పైపులైన్ ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలించారు. అనంతరం పెగ్గెర్లలో చెరువు మత్తడి లీకేజీని పరిశీలించారు. చెరువు సమీపంలో కల్వర్టు నిర్మించే స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఏఈ నవీన్, రాజు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, మార్గం శ్రీనివాస్, లవకుమార్ తదితరులున్నారు.

నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తే కఠిన చర్యలు



కవర్లు స్వాధీనం చేసుకున్న అధికారులు

కోరుట్లటౌన్: నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ జి. రవీందర్ గౌడ్ అన్నారు. పట్టణంలో టిఫిన్ సెంటర్లు, కిరాణ దుకాణాల్లో మున్సిపల్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. నిషేధిత ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకుని నిర్వాహక యజమానులకు రూ.3 వేల జరిమానా విధించారు. దుకాణదారులు చెత్తను మున్సిపల్ వాహనానికి అందజేయాలని, రోడ్లపై, మురికి కాలువల్లో చెత్త వేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రాజేంద్రప్రసాద్, అశోక్, జగదీష్, ఎన్విరాన్‌మెంట్ అధికారి మహేశ్, హేమంత్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రతీ ఒక్కరికి అందేలా చూడాలి



ఆర్డీవోకు అభినందనలు తెలుపుతున్న టీఎన్జీవోలు

జగిత్యాల: ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికి అందేలా చూడాలని అదనపు కలెక్టర్ రాజాగౌడ్ అన్నారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రాజాగౌడ్‌ను సోమవారం కలెక్టరేట్‌లో టీఎన్జీవో నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, కార్యదర్శి అమరేందర్‌రెడ్డి, వకీల్, కలెక్టరేట్ ఏవో హకీం, చెలుకల కృష్ణ, కృష్ణచైతన్య పాల్గొన్నారు.

సీఎస్సీ సెంటర్లకు అనుమతివ్వాలి



వినతిపత్రం అందిస్తున్న డిజిటల్ సేవ నాయకులు

జగిత్యాల: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఆన్‌లైన్ ద్వారా చేసేందుకు కామన్ సర్వీస్ పాయింట్ సెంటర్లకు అనుమతివ్వాలని కలెక్టరేట్‌లో డిజిటల్ సేవా సొసైటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాలకు సంబంధించి పౌరసేవలు, రెవెన్యూ సేవలు, ఆర్టీఏ సేవలు, లేబర్‌కార్డు సేవలు కామన్ పాయింట్ సర్వీస్ సెంటర్ల ద్వారా ఆన్‌లైన్ చేసేందుకు అనుమతించాలని కోరారు. కార్యక్రమంలో అనిల్, మనోహర్, రఘుపతిరెడ్డి, మల్లేశ్, శేఖర్,తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో టీచర్స్ ట్రైనింగ్ వర్క్‌షాప్

మెట్‌పల్లి: పట్టణంలోని మనోహర్ గార్డెన్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల టీచర్స్ ట్రైనింగ్ వర్క్‌షాప్‌ను సోమవారం లయన్స్ డిస్ట్రిక్ గవర్నర్ సింహరాజు కోదండరాం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి శిక్షణా తరగతుల వల్ల ఉపాధ్యాయులు తమ బోధనా పద్ధతులను మెరుగుపర్చుకోవడానికి అవకాశం కలుగుతోందన్నారు. అనంతరం ట్రైనర్ లయన్స్ కొండపల్లి రేణుక పలు అంశాలపై వారికి శిక్షణను ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ గవర్నర్ బద్రేశం, కోఆర్డినేటర్ పోతాని ప్రవీణ్, అధ్యక్షుడు వెల్ముల శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి తాకిడి



మల్లాపూర్ పీహెచ్‌సీలో బారులు తీరిన రోగులు



ఓపీ రాయించుకుంటున్న గ్రామస్తులు

మల్లాపూర్: జ్వర పీడితులతో మల్లాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కిటకిట లాడుతోంది. గత 10 రోజులుగా పీహెచ్‌సీకి రోగుల సంఖ్య పెరిగింది. గతంలో సాధారణంగా ప్రతి రోజు పీహెచ్‌సీకి 50 మంది వరకు రోగులు వైద్యం కోసం వచ్చేవారు. ప్రస్తుతం రోగుల సంఖ్య 150 నుంచి 200 వరకు పెరిగింది. జనం ఎక్కువగా జ్వరం, దగ్గుతో ఇబ్బంది పడుతూ వైద్యం కోసం వస్తున్నారు. మండలంలోని 23 గ్రామాల నుంచి వ్యాధుల బారిన పడిన రోగుల్లో ఎక్కువ మంది వైద్యం కోసం ప్రభుత్వాసుపత్రికే వస్తున్నారు. డాక్టర్‌తో పాటు వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ రోగులకు వైద్యం అందిస్తున్నారు. ఆసుపత్రిలో వసతుల కొరత ఉన్నప్పటికీ వైద్య సేవల విషయంలో ఇబ్బంది పడకుండా రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నారు.

వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు వస్తాయని,ప్రజలు తప్పనిసరిగా పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని మండల వైద్యాధికారి వాహిని సూచించారు. ఇళ్లతో పాటు ఆవరణలో నీళ్లు నిల్ల ఉండకుండా చూసుకోవాలని, బయట ఆహారం తీసుకోవద్దని వేడి ఆహారం తీసుకోవాలని, కాచి వడబోసిన నీటిని తాగాలని సూచించారు.

పింఛన్లు పెంచే వరకూ పోరాటం



కోరుట్ల లో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు



ధర్మపురిలో డీటీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కోరుట్లరూరల్/సారంగాపూర్/కథలాపూర్/ధర్మపురి/గొల్లపల్లి/మల్యాల/కొడిమ్యాల: రాష్ట్ర ప్రభుత్వం పింఛన్లు పెంచి, కొత్త పింఛన్లు మంజూరు చేసే వరకూ పోరాటం చేస్తామని ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్టుపెల్లి లక్ష్మణ్ అన్నారు. సోమవారం కోరుట్ల తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచారు. సారంగాపూర్,కథలాపూర్,ధర్మపురి,గొల్లపల్లి,మల్యాల,కొడిమ్యాల మండల కేంద్రాల్లో దివ్యాంగులు, ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన చేపట్టి తహసీల్దార్లకు వినతిపత్రాలు ఇచ్చారు. పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

విభిన్న పంటలు సాగు చేసిన రైతుకు గౌరవం



పురస్కారం అందుకుంటున్న వెంకటేష్

సారంగాపూర్: విభిన్న పంటల సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న మండలంలోని పెంబట్లకు చెందిన రైతు వెంకటేశ్‌ను యూత్ ఫర్ యాంటి కరప్షన్ సంస్థ సన్మానించింది. హైదరాబాద్‌లోని బేగంపేటలో నిర్వహించిన కార్యక్రమంలో సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, ఐఏఎస్ ఆకునూరి మురళి, మ్యూజిక్ డైరెక్టర్ ఆర్‌పీ పట్నాయక్, వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్సలర్ ప్రవీణ్‌కుమార్, రిటైర్డ్ ఏడీఏ అశోక్‌కుమార్ చేతులమీదుగా పురస్కారం అందుకున్నారు. వెంకటేశ్ తనకున్న 8 ఎకరాల్లో 15 ఏళ్లుగా వరి, సపోట, కర్బూజ, కూరగాయలు పండిస్తున్నాడు. కర్బూజలో లోపల పసుపు, బయట పసుపు పచ్చ రంగులో ఉండే విత్తనాన్ని జర్మనీ నుంచి తెప్పించి సాగు చేశాడు.

ఫీజు బకాయిల చెల్లింపులో జాప్యంపై నిరసన



నిరసన తెలుపుతున్న సిబ్బంది, విద్యార్థులు

మెట్‌పల్లి: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపుల్లో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని ఆరోపిస్తూ పట్టణంలోని జ్ఞానోదయ డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యార్థులతో కలిసి ఉపన్యాసకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ఇల్లెందుల శ్రీనివాస్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి బకాయిలను చెల్లించకపోవడం వల్ల కళాశాలల నిర్వాహణ కష్టంగా మారిందన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా కళాశాలలను బంద్ చేసి ఆందోళనలు చేస్తామన్నారు. తమ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వెంటనే బకాయిలను చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

కోరుట్ల: ఫీజు బకాయిలు చెల్లించాలని కోరుట్ల రామకృష్ణ డిగ్రీ కళాశాల విద్యార్థులు సోమవారం ఆందోళన చేపట్టారు. నాలుగేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు, అధ్యాపకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ

మల్యాల: మండలంలోని రాంపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ జన్మదినం సందర్భంగా చేపట్టిన మోదీ కానుకగా సైకిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, బీజేపీ నాయకులు గాజుల మల్లేశం. గుగ్గిళ్ళ గంగరాజం పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టండి

జగిత్యాలటౌన్: జిల్లాకేంద్రంలోని ఎల్‌ఎల్ గార్డెన్ నుంచి చింతకుంట చెరువు మీదుగా గుట్ట రాజేశ్వరస్వామి ఆలయం వరకు సీసీ రోడ్డు నిర్మించాలని మాజీమంత్రి జీవన్‌రెడ్డి కలెక్టర్ సత్యప్రసాద్‌ను కోరారు. ప్రస్తుతం ఉన్న బీట్‌బజార్ గాంధీనగర్ రోడ్డుకు ప్రత్యామ్నాయంగా 60ఫీట్ల రోడ్డును నిర్మిస్తే పట్టణ ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు.

రోలర్ స్కేటింగ్‌కు జగిత్యాల విద్యార్థి ఎంపిక

జగిత్యాల: కరీంనగర్‌లో జరిగిన రోలర్ స్కేటింగ్‌లో అత్యంత ప్రతిభ కనబర్చిన జగిత్యాలకు చెందిన విద్యార్థి అద్వైత్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. జగిత్యాలలోని మానస స్కూల్‌లో చదువుతున్న అద్వైత్ రాష్ట్రస్థాయికి ఎంపికవడం పట్ల మానస స్కూల్ యజమాన్యంతో పాటు, విద్యార్థులు అభినందించారు.

ఎమ్మెల్యేపై కుట్రపూరిత రాజకీయాలు

మల్యాల: గంగాధరకు చెందిన బండారి శ్రీనివాస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను బదనం చేసే ప్రయత్నం చేస్తున్నాడని దళిత సంఘాల నాయకులు చెవుల మద్ది శ్రీనివాస్ అన్నారు. సోమవారం మల్యాలలో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ ప్రోత్సాహంతో నే శ్రీనివాస్ సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు పెట్టారన్నారు. మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ కుట్ర పూరిత రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు.కార్యక్రమంలో దొంగ ఆనందరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బత్తిని మల్లీశ్వరి శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రిపై డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు

కోరుట్ల: పట్టణంలోని కల్లూర్ రోడ్డులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఎలాంటి వైద్య విద్య అర్హత లేని సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని, పట్టణానికి చెందిన మోర్తాడ్ రాజశేఖర్ డీఎంహెచ్‌వోకు సోమవారం ఫిర్యాదు చేశాడు. ఆస్పత్రిలో అదనపు మెడికల్ బిల్లులు వేస్తున్నారని, చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరాడు. ఆస్పత్రిలో పారిశుద్ధ్యం పాటించటం లేదని పేర్కొన్నాడు. సదరు ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరాడు.

జిల్లా ఎస్జీఎఫ్ పోటీలకు చల్‌గల్ విద్యార్థులు

కొడిమ్యాల: మండల స్థాయి క్రీడా పోటీల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల కొడిమ్యాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఖోఖోలో నందిని, భవ్యశ్రీ, కబడ్డీలో జ్యోతి,కీర్తన, శ్రీనిధి జిల్లా స్థాయికి సెలెక్ట్ అయ్యారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ ఓ.వేణు, స్పోర్ట్స్ ఇన్‌చార్జి ఎకనావిక్స్ లెక్చరర్ బండ్ల భాస్కర్, అధ్యాపకులు అభినందించారు.

మానవ అక్రమ రవాణా నిర్మూలన అందరి బాధ్యత

జగిత్యాల: మానవ అక్రమ రవాణా నిర్మూలించడం అందరి బాధ్యత అని ప్రజ్వల సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ చంద్రయ్య అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని టీచర్స్ భవన్‌లో రాష్ట్ర విద్యా పరిశోధన సంస్థ మండలి ఆధ్వర్యంలో కల్పిస్తున్న శిక్షణలో పాల్గొని మాట్లాడారు. చట్టాలు ఎవరికీ తెలియవని, బీఎన్‌ఎస్, ఐటీపీఏ, ఫోక్సో, పీసీఎంఏ, జేజేఏ యాక్ట్, సఖీ, భరోసా ఇలా చాలా ఉన్నాయని, ఉపాధ్యాయులు ఇవి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ, అఫ్స, రాజేశ్, మహేశ్, ఆనంద రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

వేణుగోపాలస్వామి ఆలయంలో గోపాల కాల్వలు, ఉట్టి వేడుకలు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తుంగూర్ పురాతన శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో వైష్ణవ కృష్ణాష్టమి పర్వదినంలో భాగంగా సోమవారం గోపాల కాల్వలు, ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం సాయంత్రం నుంచి ఆలయంలో నిరంతర భజన కార్యక్రమాలు జరిగాయి. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గ్రామాల అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మల్లాపూర్: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, పీసీసీ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు అన్నారు. సోమవారం మల్లాపూర్ మండలంలోని మొగిలిపేట, పాతదాంరాజుపల్లి గ్రామంలో ఆయన పర్యటించి పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి అభివృద్ధి పనులను పరిశీలించారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట కార్యక్రమంలో కిసాన్‌కాంగ్రెస్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ వాకిటి సత్యంరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోమ్ముల చిన్నారెడ్డి, తదితరులు ఉన్నారు.

సహస్ర లింగాల ఆలయంలో పూజలు

జగిత్యాలరూరల్: మండలంలోని పొలాస గ్రామ శివారులోని సహస్ర లింగాల ఆలయంలో సోమవారం పెద్ద ఎత్తున భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు నలమాసు గంగాధర్ పాల్గొన్నారు.

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

జగిత్యాల: టెట్ నుంచి సర్వీస్ ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని తపస్ యూనియన్ నాయకులు జిల్లా కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోనగిరి దేవయ్య, ప్రసాద్, రాష్ట్ర నాయకులు నరేందర్, ఒడ్నాల రాజశేఖర్, మహిపాల్‌రెడ్డి, రాజేశ్వర్, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

మైతాపూర్‌లో హిందీ దివస్

రాయికల్: మండలంలోని మైతాపూర్ ఉన్నత పాఠశాలలో సోమవారం హిందీ దివస్ నిర్వహించారు. విద్యార్థులకు ఉపన్యాసం, హిందీ గీతాలపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం హిందీ ఉపాధ్యాయుడు రాపర్తి నర్సయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు వేముల మధు, కల్వకోట కార్తీక్, గంగరాజం, నర్సయ్య పాల్గొన్నారు.

హిందీ భాషా దినోత్సవం

కొడిమ్యాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్,జూనియర్ కళాశాలలో సోమవారం హిందీ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు మై భారత్ జిల్లా బాధ్యులు విద్యార్థులకు హిందీ భాషా దినోత్సవం సందర్భంగా వ్యాసరచన ఉపన్యాస పోటీలను నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లావణ్య, ఉపాధ్యాయులు, జిల్లా చైల్డ్ మ్యారేజ్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ భూమేశ్, మై భారత్ జగిత్యాల జిల్లా బాధ్యులు గణేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ వ్రతం

గొల్లపల్లి: మండల కేంద్రంలో గాయత్రి మాత పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ భగవానుడి పంచాహ్నిక యజ్ఞ మహోత్సవాలు, సామూహిక విశ్వకర్మ వత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో మహిళలు, విశ్వబ్రాహ్మణ నాయకులు పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బాలభక్తుల కిషన్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు పోలుకల రాజగణేశ్, దేవరకొండ కరుణాకర్, సభ్యులు పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించిన నాయకులు

కథలాపూర్: సిద్దిపేట జిల్లా ఇందిరానగర్ నాట్కో జెడ్పీ హైస్కూల్‌ను కథలాపూర్ మండల మాజీ జెడ్పీటీసీ నాగం భూమయ్య, మాజీ ఎంపీపీ నాంపెల్లి లింబాద్రి సోమవారం సందర్శించారు. ప్రభుత్వ పాఠశాల 1200 విద్యార్థులు చదవడం గొప్ప విషయమన్నారు. పాఠశాలఅభివృద్ధి పై ధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడానికి ఆ పాఠశాలను సందర్శించినట్లు మాజీ ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు.

కల్లెడలో ఉచిత వైద్య శిబిరం

జగిత్యాలరూరల్: మండలంలోని కల్లెడ గ్రామంలో సోమవారం కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గ్రామస్తులకు మెగా వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ వర్షిత్ 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, షుగర్, బీపీ, 2ఈకో పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మెడికవర్ ఆస్పత్రి హెడ్ గుర్రం కిరణ్, ఆస్పత్రి మార్కెటింగ్ మేనేజర్లు కరుణాకర్, చంద్రశేఖర్, సాయితేజ, కో–ఆర్డినేటర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

మేడిపల్లి: జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ వొద్దినేని హరిచరణ్ రావు ఆధ్వర్యంలో సోమవారం బీమారంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. లయన్స్ క్లబ్, కరీంనగర్ రేకుర్తి కంటి ఆస్పత్రి సహకారంతో 120 మందిని పరీక్షించి మందులు అందించారు. ఆపరేషన్లు అవసరమైన 41 మందిని కరీంనగర్ ఆస్పత్రికి పంపించారు. కార్యక్రమంలో జిల్లా గవర్నర్ లయన్స్ క్లబ్ కోదండరాం, వైస్ ప్రెసిడెంట్ భద్రేశం, టెక్నీషియన్ రేకుర్తి ప్రభాకర్, మెట్‌పల్లి లయన్స్ క్లబ్ శ్రీనివాస్ రావు, మాజీ సర్పంచ్ చెక్కపల్లి అరుణ, జీర్ణ సంస్థ చైర్మన్ అంగడి ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

కథలాపూర్: మండల కేంద్రంలోని మాస్టో హైస్కూల్‌కు చెందిన బండపల్లి శ్రీరాం అనే 9వ తరగతి విద్యార్థి ఈనెల 25న నిజామాబాద్ జిల్లా ముప్కాల్‌లో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ఉపాధ్యాయులు సోమవారం తెలిపారు. ఇటీవలే జగిత్యాలలో నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలో శ్రీరాం ప్రతిభ చాటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల కరస్పాండెంట్ ఆకుల రాజేశ్, హెచ్‌ఎం రంజిత్, పీఈటీలు మల్లేశ్, శ్రావణి అభినందించారు.

తెరిచిన కల్వర్టు.. తొలగిన మురికినీరు



సాక్షి స్పందన

రాయికల్: పట్టణంలోని ఒకటో వార్డులో మూసిన కల్వర్టును తొలగించి మున్సిపల్‌సిబ్బంది మురికి నీటిని తొలగించారు. ఈనెల 8న 'సాక్షి'లో మూసిన కల్వర్టు.. ఇళ్లలోకి మురికినీరు అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి మాజీ మంత్రి జీవన్ రెడ్డి స్పందించి మురికినీరు తొలగించేలా చూడాలని సంబంధిత మున్సిపల్ కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేయగా, సోమవారం కల్వర్టును తొలగించి ఇళ్లలోని మురికి నీటిని మరో చోటుకు వెళ్లేలా కాలువ తవ్వారు. ఈ సందర్భంగా కాలనీవాసులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

కోరుట్ల రూరల్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులు వేగం పెంచాలని ఎంపీడీఓ రామకృష్ణా అన్నారు. మండలంలోని యూసుఫ్‌నగర్‌లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను ఎంపీడీఓ పరిశీలించారు. లెంటల్ లెవల్ వరకు పని పూర్తయిన ఇండ్లు త్వరిత గతిన స్లాబ్ పనులు పూర్తి చేసి బిల్లులు పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గుగ్గిళ్ల ప్రియాంకా సురేష్‌గౌడ్, కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

ఏపీవో బాధ్యతలు స్వీకరణ

కథలాపూర్: ఉపాధిహామీ మండల ఇన్‌చార్జి ఏపీవోగా కొమురయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇబ్రహీంపట్నం మండల ఏపీవో కొమురయ్యకు అదనపు బాధ్యతలు అప్పగించడంతో సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులకు భూమిపూజ

పెగడపల్లి: గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఏఎంసీ చైర్మన్ రాములుగౌడ్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని నంచర్లలో మూడో అంగన్‌వాడీ సెంటర్‌కు మంజూరైన భవన నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పీఆర్‌ఏఈ శంషేర్‌అలీ, పంచాయతీ కార్యదర్శి నవీన్, మాజీ సర్పంచ్ అంజయ్య, నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, బాబు, రాకేశ్, అంజి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

ఇబ్రహీంపట్నం: మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని ఎంపీడీవో సలీం పంచాయతీ కార్యదర్శి, ఉపాధి సిబ్బందికి సూచించారు. సోమవారం మండలంలోని అమ్మక్కపేటలో నర్సరీ, ప్లాంటేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీలో ఉన్న మొక్కలన్నీ తీసుకవెళ్లి కూలీలతో నాటించాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సరిత, టెక్నికల్ అసిస్టెంట్ వినోద్, ఫీల్డ్ అసిస్టెంట్ నరేందర్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

వంటగది పనులకు భూమిపూజ

కథలాపూర్: మండలంలోని సిరికొండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్నభోజనం వంటగది నిర్మాణం పనులకు సోమవారం అధికారులు, నాయకులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు ఇచ్చేలా చ్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈ జగదీశ్వర్, కార్యదర్శి నర్సారెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు మల్యాల మారుతి, నాయకులు పాల్గొన్నారు.

విశ్వశాంతిలో ఇంజినీర్స్ డే వేడుకలు

రాయికల్: పట్టణంలోని విశ్వశాంతి ఉన్నత పాఠశాలలో జాతీయ ఇంజినీర్స్ డే సందర్భంగా ఇంజనీర్లను సన్మానించారు. ఇంజినీర్స్ డే ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు మచ్చ లలిత, విద్యాన్వేష్, ఉపాధ్యాయులు మహేశ్, రంజిత్, రజిత, సంజన పాల్గొన్నారు.

ఇంజినీర్లకు సన్మానం

రాయికల్: ఇంజనీరింగ్ డే సందర్భంగా పట్టణంలో సోమవారం రాత్రి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇంజినీర్లను సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు కొత్తపెల్లి రంజిత్, డిసి బత్తిని భూమయ్య, ప్రధాన కార్యదర్శి అంజిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మీసేవలో నిర్ణీత రుసుము తీసుకోవాలి

రాయికల్: రాయికల్ పట్టణ, మండల మీసేవ నిర్వాహకులు ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం నిర్ణీత రుసుము మాత్రమే తీసుకోవాలని తహసీల్దార్ నాగార్జున ఆదేశించారు. సోమవారం రాయికల్ తహసీల్దార్ కార్యాలయంలో మీసేవ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియలో ప్రతి ఒక్క ఫారంపై ప్రతి ఒక్క జీపీవో సంతకం తీసుకుని అప్‌లోడ్ చేయాలని సూచించారు. నియమ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు పద్మయ్య, దేవదాసు పాల్గొన్నారు.

యూరియా పంపిణీ పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి

మల్యాల: మండల కేంద్రంలోని సహకార సంఘం ఆధ్వర్యంలో పంపిణీ చేసిన యూరియా అమ్మకాలను జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ పరిశీలించారు. మల్యాలకు 15 మెట్రిక్ టన్నులు , తక్కళ్లపల్లి 15 మెట్రిక్ టన్నులు రాగా రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కే చంద్ర దీపక్, సీఈవో శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

ఇటిక్యాల గ్రామ సేవా అధ్యక్షుడిగా లింబాద్రిగౌడ్

రాయికల్: మండలంలోని ఇటిక్యాల గ్రామ సేవ అధ్యక్షుడిగా అనుపురం చిన్న లింబాద్రిగౌడ్, ఉపాధ్యక్షుడిగా ఓరుగంటి శేఖర్, ప్రధాన కార్యదర్శిగా సామల్ల రాజ్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా సిరికొండ రాజు, కోశాధికారిగా శ్రీనివాస్, గౌరవ సలహాదారులుగా రొట్టె శ్రీనివాస్, పిప్పరి గంగాధర్, చందనగిరి నరేందర్, నేతుల గంగరాజం, శ్రీపాద లక్ష్మీనారాయణ, మెడపట్ల లక్ష్మీరాజం, రాజం సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

దుర్గాదేవి ఆలయ కమిటీ అధ్యక్షుడిగా రాజనాల మధు

రాయికల్: మండలంలోని మైతాపూర్ దుర్గాదేవి ఆలయ కమిటీ అధ్యక్షుడిగా రాజనాల మధుకుమార్, ఉపాధ్యక్షుడిగా వంగ మల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా శివనీతి అమరేందర్, కోశాధికారిగా నాగిరెడ్డి రఘుపతి, సహాయ కార్యదర్శిగా దేశవేని శ్రీనివాస్ సోమవారం ఎన్నికయ్యారు.

రామాజీపేటలో దుర్గాదేవి కరపత్రం ఆవిష్కరణ

రాయికల్: మండలం రామాజీపేట గ్రామంలోని దుర్గసేవ సమితి ఆధ్వర్యంలో శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా చేపట్టబోయే కార్యక్రమాల కరపత్రాన్ని సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బేతి లక్ష్మారెడ్డి, గౌరవ అధ్యక్షుడు దుగ్యాల రవీందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు

జగిత్యాలటౌన్: మహిళా సాధికారతే లక్ష్యంగా మహిళా కాంగ్రెస్ విభాగం ఏర్పాటు చేసినట్లు మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి అన్నారు. జిల్లా మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం ఇందిరాభవన్‌లో మహిళా కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండా ఎగురవేసి కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షురాలు పిప్పరి అనిత, జిల్లా ఉపాధ్యక్షురాలు అల్లాల సరిత, తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ ఆపరేటర్‌కు నివాళి

మల్లాపూర్: సూర్యపేట జిల్లా తుంగతుర్తి జిల్లాలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న ఏలేటి సోమిరెడ్డి ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకోగా, ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం సోమిరెడ్డి చిత్రపటానికి ఎంపీడీవో శశికుమార్‌రెడ్డి, అధికారులు నివాళి అర్పించారు.